
గౌరెల్లిలో అక్రమ నిర్మాణాన్ని సీజ్ చేస్తున్న టౌన్‌ప్లానింగ్ అధికారులు

## అక్రమ నిర్మాణాలు, షెడ్డుల సీజ్

అబ్దుల్లాపూర్‌మెట్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో అనుమతులు లేకుండా చేపట్టిన షెడ్డులను మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు శనివారం సీజ్‌చేశారు. పెద్దఅంబర్‌పేట్, కుంట్లూర్, గౌరెల్లిలో మున్సిపల్ అనుమతులు లేకుండా అక్రమంగా నిర్మించిన షెడ్డులతో పాటు నిర్మాణాలను కమిషనర్ రవీందర్‌రెడ్డి, టౌన్‌ప్లానింగ్ అధికారి శ్రీనివాస్ సిబ్బందితో కలిసి సదరు షెడ్డును సీజ్ చేసి ఫ్లెక్సీలను కట్టారు. మున్సిపల్ అనుమతులు లేకుండా ఎలాంటి నిర్మాణాలు చేపట్టినా కూల్చివేయడంతో పాటు సీజ్ చేస్తామని అధికారులు హెచ్చరించారు. కార్యక్రమంలో టౌన్‌ప్లానింగ్ సిబ్బంది రాజు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.


ఫుట్‌పాత్ ఆక్రమణలు తొలగిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

## సైదాబాద్‌లో ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు

సైదాబాద్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): సైదాబాద్ చౌరస్తా నుంచి సైదాబాద్‌కాలనీ రోడ్డు వరకు ఫుట్‌పాత్ ఆక్రమణలను జీహెచ్ఎంసీ సిబ్బంది, ట్రాఫిక్ పోలీసులు శనివారం తొలగించారు. పొట్టకూటి కోసం చిరు వ్యాపారాలు చేస్తున్న తమపై అధికారులు ప్రతాపం చూపిస్తున్నారని వ్యాపారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సైదాబాద్‌లో ఫుట్‌పాత్‌లు ఆక్రమించి భవనాలు నిర్మించిన వారిపై చర్యలు తీసుకోకపోవడం దారుణం అన్నారు. కార్యక్రమంలో సంతోష్‌నగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నర్సింహనాయక్, జీహెచ్ఎంసీ టౌన్‌ప్లానింగ్ సెక్షన్ ఆఫీసర్ నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ డయాగ్నస్టిక్ సెంటర్‌లో వైద్యాధికారుల తనిఖీ

● స్కానింగ్ యంత్రాల సీజ్

సంతోష్‌నగర్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): సంతోష్‌నగర్‌లోని డాక్టర్ డయాగ్నస్టిక్ సెంటర్‌లో శనివారం జిల్లా వైద్యాధికారులు ఆకస్మిక తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా స్కానింగ్ నమోదులో అవకతవకలు జరిగినట్లు అధికారులు గుర్తించి యంత్రాలను సీజ్ చేసినట్లు డీఎంహెచ్‌వో తెలిపారు. పేషెంట్ల స్కానింగ్ వివరాలను జిల్లా వైద్యశాఖకు అందించడం లేదని, ఎక్కువ మంది పేషెంట్లు వచ్చినా ఆన్‌లైన్ రికార్డుల్లో తక్కువగా చూపిస్తున్నారని పేర్కొన్నారు. డయాగ్నస్టిక్ సెంటర్‌లో వైద్య సిబ్బంది వివరాలను బోర్డులో పెట్టాలని సూచించారు. డయాగ్నస్టిక్ సెంటర్లలో అక్రమాలు జరుగుతున్నట్లు మీ దృష్టికి వస్తే టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని అధికారులు సూచించారు.


సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న మేయర్ పారిజాతారెడ్డి

## అన్నిప్రాంతాల అభివృద్ధే లక్ష్యం : పారిజాతారెడ్డి

సరూర్‌నగర్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని అన్ని ప్రాంతాల అభివృద్ధే తమ లక్ష్యమని మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి అన్నారు. నాదర్‌గుల్ 19వ డివిజన్‌లోని గాయత్రీనగర్ కాలనీలో కొత్తగా నిర్మించనున్న సీసీరోడ్డు పనులను శనివారం కార్పొరేటర్ రామోజీ అమితాశ్రీశైలంచారితో కలిసి ఆమె ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఇటీవల జరిగిన కౌన్సిల్ సమావేశంలో డివిజన్లకు కేటాయించిన నిధులతో చేపట్టబోయే పనులను త్వరలోనే ప్రారంభిస్తామని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు మనోహర్, ధనేశ్వర్‌రెడ్డి, భాను, సుధాకర్, కాలనీవాసులు పాల్గొన్నారు.


యోగా తరగతులు నిర్వహిస్తున్న ఆర్ట్ ఆఫ్ లివింగ్ ప్రతినిధులు

## చంచల్‌గూడ జైలులో మెడిటేషన్ డే వేడుకలు

సైదాబాద్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): చంచల్‌గూడ జైలులో శనివారం వరల్డ్ మెడిటేషన్ డే సందర్భంగా ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఆధ్వర్యంలో ఖైదీలకు యోగా, ధ్యాన తరగతులు నిర్వహించారు. ఖైదీలకు మానసిక, శారీరక ఆరోగ్యాన్ని మెరుగుపరిచేందుకు యోగా తరగతులు ఎంతగానో ఉపయోగపడుతాయని జైళ్లశాఖ డీజీ సౌమ్య మిశ్రా తెలిపారు. మెడిటేషన్ డే వేడుకలను చంచల్‌గూడ, చర్లపల్లి, సంగారెడ్డి కేంద్ర కారాగారాలతో పాటు, ఖమ్మం, ఆదిలాబాద్, మహబూబ్‌నగర్ జిల్లా జైళ్లలో నిర్వహించామని వివరించారు.


వైద్య శిబిరంలో ఏసీపీ కాశీరెడ్డి, ఇన్‌స్పెక్టర్ అంజిరెడ్డి

## గురుకుల వసతి గృహంలో ఉచిత వైద్య శిబిరం

అబ్దుల్లాపూర్‌మెట్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలం బాటసింగారంలోని గురుకుల వసతి గృహంలో రాచకొండ సీపీ సుధీర్‌బాబు సూచనల మేరకు కామినేని ఆస్పత్రి సహకారంతో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వనస్థలిపురం ఏసీపీ కాశీరెడ్డి, అబ్దుల్లాపూర్‌మెట్ ఇన్‌స్పెక్టర్ అంజిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సుమారు 500 మంది విద్యార్థులకు ఉచితంగా పలు రకాల పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. సుమారు 30 మంది వైద్యులు పాల్గొని విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మోహన్‌రావు, ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి, బధ్యానాయక్, ఆస్పత్రి సూపరింటెండెంట్ అంజయ్య, విజయభాస్కర్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

## బీజేపీ బూత్ కమిటీల నియామకం

సైదాబాద్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): బీజేపీ సైదాబాద్ డివిజన్ నూతన బూత్ కమిటీల నియామకం శక్తి కేంద్ర ఇన్‌చార్జి రమణ్‌సింగ్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. నూతన అధ్యక్షులుగా ఎంపికైన వెంకట్‌రాజు, లోకేష్, సాయికృష్ణలకు కార్పొరేటర్ కొత్తకాపు అరుణారెడ్డి నియామకపత్రాలు అందజేశారు. ఈ ఎన్నికలకు రిటర్నింగ్ అధికారిగా మలక్‌పేట నియోజకవర్గ మాజీ కన్వీనర్ నర్సింహ వ్యవహరించారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు వినోద్‌గౌడ్, సురేందర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, గజానంద్, లక్ష్మీ పాల్గొన్నారు.

# వ్యవసాయ మార్కెట్లను అభివృద్ధి పరుస్తాం

● మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

ఓల్డ్‌మలక్‌పేట, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో రాబోయే రోజుల్లో వ్యవసాయ మార్కెట్లను మరింత అభివృద్ధి పరిచి మార్కెట్ కమిటీలను పటిష్టం చేస్తామని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్‌లు అన్నారు. శనివారం సాయంత్రం మలక్‌పేటలోని హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం ప్రమాణస్వీకారం జరిగింది. ఈ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతుల శ్రేయస్సుకు కృషి చేస్తుందన్నారు. రైతులు పండించిన పంటకు మార్కెట్‌లో గిట్టుబాటు ధర కల్పించే విధంగా పాలకమండలి కృషిచేయాలని సూచించారు. రైతులు సంప్రదాయ పంటలతో పాటు వాణిజ్య పంటలవైపు కూడా దృష్టి సారించాలని తద్వారా రైతులకు అధిక ఆదాయం వస్తుందన్నారు. త్వరలోనే రైతు బంధు డబ్బులు రైతుల ఖాతాల్లో జమౌతాయన్నారు. సీఎం రేవంత్‌రెడ్డితో చర్చించి మార్కెట్‌ను మలక్‌పేట నుంచి కొహెడకు మార్చేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అక్కడే హమాలీలకు, కూలీలకు డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించి ఇస్తామన్నారు. హైదరాబాద్‌కు ప్రపంచంలోనే మంచి గుర్తింపు తెచ్చే విధంగా గ్లోబల్ సిటీగా మార్చేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. మెట్రోవిస్తరణ, మూసీ పునరుజ్జీవం, ఫ్యూచర్‌సిటీ నిర్మాణం, రీజినల్ రింగ్‌రోడ్డు, లాంటి అభివృద్ధి పనులతో పాటు గ్రేటర్‌వాసులకు భవిష్యత్తులో తాగునీటి సమస్య రాకుండా ఉండేందుకు గోదావరి, కృష్ణా నీటిని హైదరాబాద్‌కు తెస్తున్నామన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చెకోలేకర్ శ్రీనివాస్, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ కోట్ల శ్రీనివాస్, డైరెక్టర్లు మహ్మద్ షకీల్, రామారావు, అశోక్,రాజేందర్‌రెడ్డి, సత్యనారాయణ, కిషన్‌సింగ్, మార్కెట్ అధికారులు దామోదర్, చిలుక నర్సింహారెడ్డి, నాయకులు బొల్లు కిషన్ పాల్గొన్నారు.


మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారకార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పక్కన మధుయాష్కీగౌడ్

## అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి : సీపీఐ

అబ్దుల్లాపూర్‌మెట్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్‌ను ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను వెంటనే బర్తరఫ్ చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్రచారి డిమాండ్ చేశారు. శనివారం ఆ పార్టీ అబ్దుల్లాపూర్‌మెట్ మండల కమిటీ ఆధ్వర్యంలో ఆర్ఎన్ఆర్‌కాలనీ చౌరస్తాలో అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా రవీంద్రచారి, రాష్ట్ర సమితి సభ్యుడు యాదిరెడ్డి మాట్లాడుతూ వెంటనే అమిత్‌షా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పబ్బతి లక్ష్మణ్, అజ్మీర్ హరిసింగ్‌నాయక్, యాదగిరి, నర్సింహ, ప్రసాద్, మధు, నారాయణరెడ్డి, రాములు, శ్రీనివాస్, సాగర్ పాల్గొన్నారు.


హయత్‌నగర్ డిగ్రీ కళాశాలలో రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పిస్తున్న ప్రిన్సిపాల్ సురేష్‌బాబు


హెచ్ఎం శ్యాంసుందర్‌రెడ్డితో కలిసి ప్రతిభకనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న కార్పొరేటర్ నర్సింహారెడ్డి

# రామానుజన్‌ను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలి

● జయంతి వేడుకల్లో ప్రిన్సిపాల్ సురేష్‌బాబు

హయత్‌నగర్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): గణితశాస్త్రంలో శ్రీనివాస రామానుజన్ సృష్టించిన అద్భుతాలను విద్యార్థులు ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని హయత్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సురేష్‌బాబు అన్నారు. శ్రీనివాసరామానుజన్ జయంతిని పురస్కరించుకుని శనివారం హయత్‌నగర్ డిగ్రీ కళాశాలలో శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి ఆయన పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రముఖుల జీవితాలను ఆదర్శంగా తీసుకుని జీవితంలో ముందుకు సాగాలని కోరారు. గణితశాస్త్ర విభాగాధిపతి శ్రీనివాస్‌రెడ్డి, గణితశాస్త్ర అధ్యాపకుడు నక్క నర్సింహ మాట్లాడుతూ గణిత విశ్లేషణ, అనంతశ్రేణులు, సంఖ్యాశాస్త్రంలో ఎన్నో పరిశోధనలు చేశారని వారు గుర్తుచేశారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల కోఆర్డినేటర్ బకరం నర్సింహ, అధ్యాపకులు విద్యాసాగర్, అపర్ణ, చతుర్వేది, రమాదేవి, దుర్గాప్రసాద్, వెంకటేశ్వర్లు, యాదగిరిరెడ్డి పాల్గొన్నారు.

### సౌత్‌ఎండ్ పార్కు కాలనీలోని ప్రభుత్వ పాఠశాలలో..

మన్సూరాబాద్ : గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతి వేడుకలు మన్సూరాబాద్ డివిజన్ సౌత్‌ఎండ్ పార్కు కాలనీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శనివారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్యాంసుందర్‌రెడ్డి నేతృత్వంలో వ్రతం ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు గణిత మేళా ద్వారా పలు పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి విచ్చేసి మేళాలో ప్రతిభకనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు యాదగిరి, సరూర్‌నగర్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజశేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


గణిత అంశాల నమూనాను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పవన్‌కుమార్, విజయేందర్‌రెడ్డి

### జడ్పీహెచ్ఎస్‌లో..

కొత్తపేట : కొత్తపేట జడ్పీహెచ్ఎస్‌లో జాతీయ గణిత దినోత్సవాలు ఉల్లాసంగా కొనసాగాయి. ఆదివారం గణిత మేధావి శ్రీనివాసరామానుజన్ జయంతిని పురస్కరించుకుని శనివారం పాఠశాలలో విద్యార్థుల ప్రతిభను పరీక్షించేలా వ్యాసరచన, ఉపన్యాసం, క్విజ్, గణిత అంశాల నమూనాల ప్రదర్శన ఏర్పాటు చేశారు. రామానుజన్ చిత్రపటానికి కార్పొరేటర్ పవన్‌కుమార్, హెచ్ఎం విజయేందర్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్పొరేటర్ హెచ్ఎంతో కలిసి గణిత నమూనాలను పరిశీలించారు. పోటీల్లో గెలిచిన వారికి కార్పొరేటర్ బహుమతులు అందజేశారు. తొలుత పాఠశాలలో పేరెంట్స్ మీటింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో గణిత ఉపాధ్యాయులు జితేందర్‌రెడ్డి, శైలజ, గణష్, ఉపాధ్యాయులు కృష్ణారెడ్డి, రాంనాథ్‌రెడ్డి, చంద్రలేఖ, ఉమారాణి పాల్గొన్నారు.

# కష్టపడి పనిచేసిన వారికి పార్టీలో సముచిత స్థానం

● బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి

మన్సూరాబాద్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): బీజేపీలో కష్టపడి పనిచేసిన ప్రతి నాయకుడికి, కార్యకర్తకు సముచిత స్థానం దక్కుతోందని పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి పేర్కొన్నారు. రంగారెడ్డి అర్బన్ జిల్లా పరిధిలో నూతన పోలింగ్ బూత్, డివిజన్, జిల్లా కమిటీల ఏర్పాటుకు ఎల్బీనగర్‌లోని బీజేపీ కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి ఆధ్వర్యంలో శనివారం క్రియాశీల సభ్యత్వ నమోదు, పోలింగ్ బూత్ కమిటీల నివేదిక సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ప్రేమేందర్‌రెడ్డి మాట్లాడుతూ బూత్ స్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు అధ్యక్షులు, కమిటీల ఎన్నిక దశలవారీగా కొనసాగుతోందని, ఇందులో భాగంగా మొదట బూతు కమిటీలను ఎన్నుకోవడం జరుగుతుందన్నారు. తదనంతరం 24, 25వ తేదీల్లోపు డివిజన్ అధ్యక్షులు, 26, 27వ తేదీల్లోపు జిల్లా అధ్యక్షులు, జనవరి మొదటి వారంలో రాష్ట్ర అధ్యక్షులు, రెండోవారంలో జాతీయ అధ్యక్షుడి ఎన్నికలు జరిపేందుకు జాతీయ పార్టీ నిర్ణయించిందన్నారు. ఈ ఎన్నికల్లో భాగంగా బూత్ కమిటీల్లో ఎస్సీ, ఎస్టీలతో పాటు మహిళలకు ప్రాధాన్యత ఉంటుందని, రంగారెడ్డి అర్బన్ జిల్లా పరిధిలో ప్రక్రియను వేగవంతం చేసి సమయానికి కమిటీల నివేదికను సమర్పించాలని సూచించారు. ఈ నివేదికలను నాలుగు రోజుల్లో పూర్తిస్థాయిలో రాష్ట్ర పార్టీకి అందజేస్తామని ప్రేమేందర్‌రెడ్డి తెలిపారు. సమావేశంలో మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్‌చందర్‌జీ, మన్సూరాబాద్ కార్పొరేటర్, జీహెచ్ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహారెడ్డి, కన్వీనర్ కొత్త రవీందర్‌గౌడ్, వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి, రాఘవేందర్‌రావు, నాయకులు రుద్రారపు శంకర్, పద్మారెడ్డి, గీతారెడ్డి, నాంపల్లి రామేశ్వర్ పాల్గొన్నారు.

# చైన్ స్నాచర్లపై ఉక్కుపాదం : సీపీ సుధీర్‌బాబు

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): మహిళల పట్ల నేరాలకు పాల్పడే వారిని, చైన్ స్నాచర్లను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని కమిషనర్ సీపీ సుధీర్‌బాబు హెచ్చరించారు. ఎల్బీనగర్ క్యాంపు కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎల్బీనగర్ జోన్‌లో ఈ ఏడాదిలో నమోదైన 25 చైన్‌స్నాచింగ్ కేసులను పరిష్కరించిన 18మంది సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. కేసుల ఛేదనలో క్రైం, సీసీఎస్, ఐటీ సెల్ శాఖలు సమన్వయంతో పనిచేశాయన్నారు. సీసీ కెమెరాల ద్వారా నిందితులను గుర్తించడం సులభంగా మారుతుందని, కమిషనరేట్ పరిధిలో సీసీ కెమెరాల వినియోగం పెంచాలని సూచించారు. మహిళల రక్షణకు రాజీ పడకుండా పనిచేస్తున్నామని చెప్పిన సీపీ, నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో డీసీపీలు ప్రవీణ్‌కుమార్, మురళీధర్, అడిషనల్ డీసీపీ నర్సింహారెడ్డి, ఏసీపీ కాశిరెడ్డి పాల్గొన్నారు.


చెయిన్ స్నాచింగ్ కేసులను ఛేదించిన సిబ్బందిని అభినందిస్తున్న సీపీ సుధీర్‌బాబు

## దాడి చేసిన వారి కోసం పోలీసు బృందాల గాలింపు

దిల్‌సుఖ్‌నగర్ : నడిరోడ్డుపై వేటకొడవళ్లతో వెంటాడి వేటాడి ఇద్దరు వ్యక్తులపై హత్యాయత్నానికి పాల్పడిన నిందితుల కోసం రాచకొండ పోలీసులు గాలిస్తున్నారు. సీపీ ఆదేశాలతో 10ప్రత్యేక పోలీస్ బృందాలు రంగంలోకి దిగాయి. పాత కక్షలను మనసులో పెట్టుకున్న ఒక ముఠా.. ప్రత్యర్థులను చంపడానికి నిఘాపెట్టింది. శుక్రవారం చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రత్యర్థులు ఉన్నట్లు తెలుసుకొని సినీ పక్కీలో వేట కొడవళ్లు, కత్తులతో దాడికి దిగారు. వారి నుంచి తప్పించుకున్న బాధితులు ఓ బ్యాంకులో దాక్కున్నా వదలకుండా కత్తులతో దాడికి పాల్పడి తీవ్రంగా గాయపరిచారు. గాయాలపాలైన బాధితులు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు చైతన్యపురి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్న విషయం తెలిసిందే.

# కూతురుపై తండ్రి అత్యాచారం

● అరెస్టు చేసి జైలుకు తరలించిన పోలీసులు

దిల్‌సుఖ్‌నగర్ : చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణం చోటుచేసుకుంది. కంటికి రెప్పలా కాపాడాల్సిన తండ్రి.. కూతురుపై కన్నేశాడు. పదోతరగతి చదువుతున్న కూతురును భయపెట్టి బెదిరించి కొంతకాలంగా అత్యాచారం చేస్తున్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ దారుణాన్ని తెలుసుకున్న బాధితురాలి నాయనమ్మ చైతన్యపురి పోలీసులకు ఫిర్యాదు చేసింది. వివరాల్లోకి వెళ్తే.. బాధితురాలికి తల్లి చనిపోవడంతో తండ్రి మరో పెళ్లిచేసుకున్నాడు. దాంతో సవితి తల్లి, తండ్రితో కలిసి ఉంటోంది. తండ్రి, సవితి తల్లి లేబర్ పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో మద్యానికి బానిసైన తండ్రి కొంతకాలంగా కూతురుపై లైంగిక దాడికి పాల్పడుతున్నాడు. ఆ విషయం తెలిసినా సవితి తల్లి భర్తను నిలదీయకుండా అతనికి సపోర్టు చేసేది. దాంతో తనపై జరుగుతున్న దారుణాన్ని బాధితురాలు నాయనమ్మకు చెప్పడంతో విషయం బయటకు వచ్చింది. దాంతో నాయనమ్మ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోక్సో కేసు నమోదు చేసిన పోలీసులు శనివారం నిందితున్ని, అతనికి సహకరించిన సవితి తల్లిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కౌన్సెలింగ్, వైద్య పరీక్షల నిమిత్తం బాధితురాలిని సఖి సెంటర్‌కు పంపించినట్లు తెలిసింది.

# మెట్రోలో మహిళల భద్రతకు ప్రాధాన్యం

(5వ పేజీ తరువాయి)

వరకు మహిళా కెప్టెన్ల ద్వారా ఫస్ట్‌మైల్, లాస్ట్‌మైల్ కనెక్టివిటీని అందిస్తే ఆ వర్గానికి చెందిన ప్రయాణికులకు మరింత ధైర్యం, అనుకూలత ఉంటుందన్నారు. నగరంలో మెట్రో రెండోదశ విస్తరణ పనులు వేగంగా జరుగుతున్నాయని, ఓల్డ్‌సిటీలో త్వరలో కూల్చివేత పనులను ప్రారంభిస్తామన్నారు. ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు 1100 ఆస్తులు మెట్రో నిర్మాణంలో పోతున్నాయని, ఆస్తులు కోల్పోతున్నవారికి గజానికి రూ.81వేల పరిహారం అందిస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

### గ్రీన్ ట్యాక్సీలు తీసుకొస్తాం: వరదరాజన్

రానున్న రోజుల్లో నగరంలో ఫస్ట్‌మైల్, లాస్ట్‌మైల్ కనెక్టివిటీ కింద మెట్రో స్టేషన్ల నుంచి రోజుకు 2 లక్షల మందికి సేవలందిస్తామని ఎల్ అండ్‌టీ చీఫ్ స్ట్రాటజిక్ ఆఫీసర్ మురళీవరదరాజన్ అన్నారు. ప్రధానంగా గ్రీన్ ట్యాక్సీలను అందుబాటులోకి తీసుకొచి కాలుష్యాన్ని అరికట్టేందుకు తమవంతు కృషి చేస్తామన్నారు. ఎల్‌అండ్‌టీ చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ రిషివర్మ మాట్లాడుతూ 2021లో ర్యాపిడో సంస్థతో తాము ఒప్పందం చేసుకున్నామని, ప్రస్తుతం రోజుకు 45వేల మంది ఫస్ట్‌మైల్, లాస్ట్‌మైల్ కనెక్టివిటీని సేవలు పొందుతున్నారని, రానున్న రోజుల్లో 75వేల మంది వినియోగించుకునేలా కృషి చేస్తామన్నారు. ర్యాపిడో కోఫౌండర్ పవన్ మాట్లాడుతూ.. నగరంలో బైక్‌లు, ఆటోలు, కార్ల ద్వారా తాము ప్రతిరోజు 2.7 లక్షల మందికి సేవలందిస్తున్నట్లు చెప్పారు. మెట్రో స్టేషన్ల నుంచి 0-3 కిలోమీటర్ల వరకు 30, 3-4 కిలోమీటర్లకు రూ.40, 4-5 కిలోమీటర్లకు రూ.50 చొప్పున చార్జీలను తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎల్‌అండ్‌టీ అధికారులు, ర్యాపిడో సిబ్బంది పాల్గొన్నారు.


కొత్తపేట చౌరస్తాలో శ్రీ వైభవం షాపింగ్‌మాల్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, రోడ్ డెవలప్‌మెట్ కార్పొరేషన్ చైర్మన్ రాంరెడ్డి తదితరులు

## కొత్తపేటలో శ్రీవైభవం షాపింగ్ మాల్ ప్రారంభం

ఎల్‌బీనగర్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): కొత్తపేట చౌరస్తాలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీవైభవం షాపింగ్ మాల్‌ను ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తెలంగాణ రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, కార్పొరేటర్ రాధా ధీరజ్‌రెడ్డిలతో కలిసి శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సినీనటి శ్రీలీల ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. కార్యక్రమంలో తెలంగాణ ఫైనాన్స్ కమిషన్ సభ్యులు సంకేపల్లి సుధీర్‌రెడ్డి, చెలమల్ల కృష్ణారెడ్డి, శ్రీనివాస్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ జైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.


స్వామికుమార్‌గౌడ్‌కు నియామక పత్రం అందజేస్తున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్

## బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా స్వామికుమార్

ఎల్‌బీనగర్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా చింతకింది స్వామికుమార్‌గౌడ్ నియమితులయ్యారు. శనివారం జరిగిన బీసీ విద్యార్థి సంఘం రాష్ట్రస్థాయి సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ చింతకింది స్వామికుమార్‌కు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఉద్యమిస్తామన్నారు. తనను ఉపాధ్యక్షుడిగా నియమించిన బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్‌కు, నియామకానికి సహకరించిన రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ పాలకూరి కిరణ్‌గౌడ్, కేంద్ర కమిటీ అధ్యక్షుడు తాటికొండ విక్రమ్‌గౌడ్, రాష్ట్ర అధ్యక్షుడు గొడుగు మహేష్‌యాదవ్‌లకు స్వామికుమార్‌గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు.

## 'బంజారా సంఘం మహాసభకు తరలిరండి'

సైదాబాద్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): సేవాలాల్ బంజారా సంఘం పదో వార్షికోత్సవ మహాసభకు మహిళలు భారీగా తరలిరావాలని సంఘం మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు సక్రిబాయి కోరారు. శనివారం సింగరేణి కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ 22న ఉదయం 9.30గంటలకు బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మహాసభ ప్రారంభమవుతుందన్నారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి భారీ ఎత్తున మహాసభకు తరలిరావాలన్నారు. గిరిజన హక్కులు, రిజర్వేషన్లు, బంజారాభాష లిపిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం గుర్తించాలని బంజారా సంఘం ముఖ్య ఉద్దేశమన్నారు. బంజారా వేషధారణలో సుమారు 300 మంది మహిళలు ఈ సభకు హాజరవుతున్నట్లు స్పష్టం చేశారు. కార్యక్రమంలో మహిళా సంఘం నాయకులు శాంతిబాయి, టైలర్ శాంతి దేవిబాయి, అలివేలుబాయి, శారదబాయి, సరోజా, జయమ్మ పాల్గొన్నారు.

## ఏఆర్ కానిస్టేబుళ్లకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

కొత్తపేట, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి) : రాచకొండ కమిషనరేట్‌లో ఎంపికైన 61మంది ఏఆర్ పోలీస్ కానిస్టేబుళ్లకు శనివారం ట్రాఫిక్ ట్రెయినింగ్ ఇనిస్టిట్యూట్(టీటీఐ)లో వారం రోజుల శిక్షణలో పలు పాఠ్యాంశాలపై పరీక్ష నిర్వహించారు. వర్టికల్స్ ప్రాధాన్యత, ఎంవీ యాక్టులో విశేషాలపైన ఇన్‌స్పెక్టర్ అర్జున్, విశ్రాంత ఇన్‌స్పెక్టర్ అమరవర్ధన్‌రెడ్డి, ఎస్పీఓ అల్లూరయ్య, ఎస్ఐ మనోహర్, సిబ్బంది రమేష్‌లు పరీక్షలు నిర్వహించారు. శిక్షణలో పాల్గొంటున్న మహిళా కానిస్టేబుళ్లకు ఫీల్డ్ ట్రిప్‌లో ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ అధికారులు అల్కాపురి, హస్తినాపురం తదితర ట్రాఫిక్ సిగ్నల్ జంక్షన్ల వద్ద ట్రాఫిక్ నియంత్రణపై, సిగ్నలింగ్ వ్యవస్థపై అవగాహన కల్పించారు.


హస్తినాపురం ట్రాఫిక్ జంక్షన్ వద్ద ఏఆర్ కానిస్టేబుళ్లకు సిగ్నలింగ్ సిస్టం పనితీరును వివరిస్తున్న అధికారులు

## టిమ్స్ ఆస్పత్రి ప్రహరీ కూలి 18 ద్విచక్రవాహనాలు ధ్వంసం

దిల్‌సుఖ్‌నగర్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): చైతన్యపురి పోలీస్‌స్టేషన్ పరిధిలోని గడ్డిఅన్నారం పండ్ల మార్కెట్ ప్రస్తుతం టిమ్స్ ఆస్పత్రి వద్ద నూతనంగా నిర్మిస్తున్న ప్రహరీగోడ కూలి సుమారు 18ద్విచక్ర వాహనాలు ధ్వంసం అయ్యాయి. లోపల మట్టి పనులు జరుగుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు గోడ కూలినట్లు తెలిసింది. గోడకూలిన సమయంలో వాహనాలు తప్ప ఎవరు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. నిర్మాణదారుల నిర్లక్ష్యంతోనే గోడ కూలినట్లు కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. సంబంధించిన సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు.


ధ్వంసమైన ద్విచక్ర వాహనాలు